

అప్రమత్తతే శ్రీరామరక్ష

గ్రామాల్లో ఆటలమ్మ, గవద బిళ్లల కేసులు పెరుగుతున్నాయి. వీటిపై అప్రమత్తంగా ఉండాలి.

- 8లో



చిల్లంగి నెపంతో చంపేశారు

డిసెంబర్‌లో జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. చిల్లంగి నెపంతో చంపేసినట్టు గుర్తించారు.

- 8లో

డీఎంహెచ్‌ఓగా సుజాత

అరసవల్లి: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా డాక్టర్ జి.సుజాతకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ బండారు సుబ్రహ్మణ్యేశ్వరి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు డీఎంహెచ్‌ఓగా పనిచేసిన బాలమురళీకృష్ణ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన సంగతి తెలిసిందే. సుజాత ప్రస్తుతం విశాఖ రీజనల్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈమె నేడో రేపో శ్రీకాకుళంలో డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించనున్నారు.

న్యూస్‌రీల్

పురుషోత్తపురంలో డయేరియా



గ్రామంలో వైద్య శిబిరం

ఇచ్ఛాపురం టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురంలో డయేరియా ప్రబలుతోంది. ఈ ప్రాంతంలో ఐదుగురు డయేరియాతో బాధ పడుతున్నారు. దీంతో ఒకటో వార్డు కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రేమ్‌కుమార్ మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌కు వినతి పత్రం అందించారు. ఆ మేరకు కమిషనర్ పురుషోత్తపురంలో గల బావి, వీధుల్లో క్లోరినేషన్ చేయించారు. అర్బన్ హెల్త్‌సెంటర్ డాక్టర్ జూహిత, ఇతర వైద్య సిబ్బంది బుధవారం గ్రామంలో ఇంటింటా సర్వే చేసి రోగులకు మందులు అందజేశారు. వైద్య శిబిరం నిర్వహించి అవగాహన కల్పించారు.

ఘనంగా ఆగ్నేయ స్థాలిపాక హోమం



ఆదిత్యుని మండపంలో ఆగ్నేయ స్థాలిపాక హోమం జరుగుతున్న దృశ్యం

అరసవల్లి: ఆదిత్యుని వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా బుధవారం సాయంత్రం ఆలయ మండపాల్లో ఘనంగా ఆగ్నేయ స్థాలిపాక హోమాలు జరిపించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం భారతి రమేష్ ప్రముఖ గాయకుడు భారతి రమేష్ ఆధ్వర్యంలో భక్తి గీతాలాపన కార్యక్రమాలు నిర్వహించారు.

1800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

సోంపేట,మందస: సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నవోదయం 2.0లో భాగంగా బుధవారం ఎక్సైజ్ అధికారులు ముమ్మర దాడులు చేపట్టారు. ఇందులో భాగంగా స్టేషన్ పరిధిలోని మందస మండలం చీపి పంచాయతీ పుట్టూరులో దాడి చేసి 1800 లీటర్ల బెల్లం ఊట, 75 కిలోల బెల్లాన్ని ధ్వంసం చేసినట్టు సోంపేట ఎక్సైజ్ సీఐ కె.బేబి తెలిపారు. అలాగే 40 లీటర్ల నాటు సారాతో సవర కుమారిని అరెస్టు చేశామన్నారు. బెల్లం ఊట నిల్వ చేసేందుకు ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

వంశధార పనుల పరిశీలన



మ్యాప్ ద్వారా పనులను పరిశీలిస్తున్న అధికారులు

హిరమండలం: వంశధార రిజర్వాయర్ పనులను వేగంగా పూర్తిచేయాలని చీఫ్ ఇంజినీర్ డి.రామ్‌గోపాల్ అన్నారు. బుధవారం ఎస్‌ఈ తిరుపతిరావుతో కలిసి వంశధార రిజర్వాయర్ పనులను ఆయన పరిశీలించారు. పెండింగ్ పనుల గురించి ఆరా తీశారు. పనులకు సంబంధించి మ్యాప్ పరిశీలించి అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. ఎట్టి పరిస్థితుల్లో ఖరీఫ్‌నకు సాగునీరు అందించాలన్నారు. పెండింగ్ పనులపై దృష్టిపెట్టామని, స్పిల్ వేతో పాటు గేట్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం వంశధార నదిలో ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులను సైతం పరిశీలించారు. అక్కడ అధికారులతో పాటు నిర్మాణ సంస్థలకు కీలక ఆదేశాలు ఇచ్చారు. వారి వెంట డీఈఈ శ్రీహరి, సిబ్బంది సురేష్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యత

మందస: రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో వన్యప్రాణుల రక్షణ అందరి బాధ్యతని ఎఫ్ఆర్‌ఓ మురళీకృష్ణంనాయుడు అన్నారు. ఆర్‌ఓ రాముతో కలిసి ఆయన మంగళవారం చీపి, కృష్ణపురం, పిల్లిబుదరిసింగి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వేసవిలో వన్య ప్రాణులు నీరు తాగేందుకు బయటకు వస్తుంటాయని, వాటికి హాని తలపెట్టకూడదని తెలిపారు. జంతువులు కనిపిస్తే వాటిని సంరక్షించాలన్నారు.



ట్రెంచే చేను మేసింది

ఇది ట్రెంచ్ అంటే నమ్ముతారా? కానీ అధికారుల దృష్టిలో ఇది ట్రెంచే. సాధారణంగా భూమిలో తవ్విన పొడవైన కందకాన్ని లేదా కాలువను ట్రెంచ్ అంటారు. అటు ఇటు రాకపోకలు జరగకూడదన్నది దీని ఉద్దేశం. కానీ గారలోని వంశధార నదిలో ఇసుక మేట వేసి దాన్నే ట్రెంచ్ అంటున్నారు. ప్రస్తుతం కొన్ని చోట్ల ట్రెంచ్ పక్క నుంచే రాత్రి పూట ప్రవేశించగా, మరికొన్ని చోట్ల ఇసుక మేటతో కూడిన ట్రెంచ్‌ను తొలగించి ఇష్టారీతిన ఇసుక తవ్వకాలు జరిపి, తెల్లవారేసరికి మళ్లీ అదే ప్లేస్‌లో ఇసుక మేట వేసి అక్రమార్కులు మాయ చేస్తున్నారు.

- వంశధార నదిలో ఆగని విధ్వంసం
- చెలరేగిపోతున్న ఇసుక అక్రమార్కులు
- ఎన్జీటీ ఆదేశాలను సక్రమంగా అమలు చేయని అధికారులు
- నామమాత్రపు ట్రెంచ్‌లు వేసి చేతులు దులుపుకుంటున్న పరిస్థితి
- రాత్రిపూట ఆ ట్రెంచ్‌లను తొలగించి అక్రమాలకు పాల్పడుతున్న ఇసుక దొంగలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను ఇసుకాసురులు పట్టించుకోవడం లేదు. గారలోని వంశధార నదిలో ప్రభుత్వం అనుమతి ఇచ్చిన డీ సిల్టేషన్ పాయింట్‌లో ఇష్టారీతిన తవ్వకాలు జరపడం వల్ల భూగర్భ జలాలకు ముప్పుగా పరిణమించింది. నదిలో కూడా గోతులతో విధ్వంసం జరుగుతుండడం, వ్యవసాయ, తాగునీటి బోర్లకు ప్రమాదం వాటిల్లేలా తవ్వకాలు జరగడంపై కొందరు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్జీటీ)ను ఆశ్రయించారు. దాంతో అక్కడ తక్షణమే తవ్వకాలు ఆపాలని, నదిలోకి వెళ్లకుండా ట్రెంచ్ తవ్వించాలని ఎన్జీటీ సూచించింది. కానీ ఇక్కడ ఆ పని జరగలేదు. ఇసుకనే మేటగా వేసి, దాన్నే ట్రెంచ్‌గా చూపించి మమ అనిపించేశారు.

బైరిలోనూ అదే పరిస్థితి

బైరిలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా నదిలోకి నేరుగా రోడ్డు వేసేశారు. అనుమతి ఉన్న ర్యాంపుగా చెప్పుకుని అడ్డగోలు కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. నదీ గమనాన్ని మార్చేసేలా రోడ్డు వేయడమే కాకుండా నదిలో ప్రవహిస్తున్న నీటిని మళ్లించేలా పైపులతో చిన్న పాటి వంతెనను కూడా నిర్మించేశారు. అంతటితో ఆగకుండా పరిమితికి మించి, లోతైన గోతులు తవ్వి, ఇసుకను తోడేస్తున్నారు.



బైరిలో నదిలో అడ్డంగా వేసిన రోడ్డు

అక్రమార్కులు విధ్వంసానికి నది స్వరూపమే మారిపోయి, ప్రమాదకరంగా తయారైంది.



బైరిలో నదిలో నీటిని మళ్లించేందుకు పైపులతో వేసిన వంతెన

దీంతో ఇసుకతో కోట్లు సంపాదిస్తున్న అక్రమార్కులు ఆగుతారా? తమకు అలవాటైన విధంగా దొంగ పని చేస్తున్నారు. రాత్రిపూట వంశధార నదిలోకి చొరబడుతున్నారు. అధికారులు చెబుతున్న ట్రెంచ్(ఇసుక మేట)ను తొలగించి కొన్నిచోట్ల రాత్రంతా తవ్వకాలు జరపగా, మరికొన్నిచోట్ల ఆ ఇసుక ట్రెంచ్‌ల పక్క నుంచి నదిలో చొరబడి తవ్వకాలు జరుపుతున్నారు, తవ్విన ఇసుకను ఒడ్డుకు తెచ్చి... తెల్లారేసరికి మళ్లీ ట్రెంచ్‌గా చెబుతున్న చోట మళ్లీ ఇసుక మేట వేసి వ్యవహారాన్ని చక్కదిద్దేస్తున్నారు.

పేరుకే అక్కడ తవ్వకాలు నిలిచిపోయాయి. కానీ, అనధికారికంగా ఎప్పటిలాగానే తవ్వకాలు జరగడంతో పాటు అడ్డగోలుగా ఇసుక విక్రయాలు నడుస్తున్నాయి. ఇదంతా అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే నడుస్తోంది. ఎంత దారుణమంటే రాత్రి తవ్విన ఇసుకను నది పక్కన కుప్పలు వేసి విక్రయిస్తున్నా అధికారులకు కనిపించడం లేదు. అక్కడ అనుమతుల్లేవని చెప్పి చేతులు దులుపుకోవడం తప్ప చేసిందేమీ లేదు. యథేచ్ఛగా అక్రమాలు జరిగిపోతున్నాయి. స్థానికులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే మళ్లీ ఆ అక్రమాలకు పాల్పడిన వారికే సమాచారం వెళ్లిపోతోంది. దీంతో ఆ సమయంలో వ్యవహారాలను నిలిపేసి, తర్వాత మళ్లీ యథావిధిగా కానిచ్చేస్తున్నారు. అంతా కలిసి గూడు పుఠాణీతో ఇసుక అక్రమాలను కొనసాగిస్తున్నారు. దీంతో లోతైన గోతుల కారణంగా సముద్రం బ్యాక్ వాటర్ కిలోమీటర్ల మేర ముందుకొచ్చేస్తోంది. సమీపంలో ఉన్న తాగునీటి వనరులు కలుషితమైపోతున్నాయి. నీరు ఉప్పు నీరుగా మారిపోతోంది. అంతేకాకుండా కొన్నిచోట్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి వ్యవసాయ పంపులు, రక్షిత మంచినీటి పథకాలు పనిచేయకుండా పోతున్నాయి.

హోం మంత్రి వ్యాఖ్యలు అర్థరహితం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



నరసన్నపేట: నడిరోడ్డుపై లింగమయ్యను హత్య చేస్తే దాన్ని కుటుంబ వివాదంగా హోం మంత్రి అనిత మాట్లాడటం శోచనీయమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. లింగమయ్య హత్య తదనంతర పరిస్థితులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శకు వెళ్లడంపై హోం మంత్రి మాటలు బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమన్నారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. కేసు దర్యాప్తును నీరు గార్చేలా హోం మంత్రి మాటలు ఉన్నాయని ఆందోళన చేశారు. ఆమె ఒక టీడీపీ నాయకురాలిగా మాట్లాడుతున్నారే తప్ప ఒక రాష్ట్రానికి హోం మంత్రిలా మాట్లాడటం లేదని ఎద్దేవా చేశారు. లింగమయ్యది ముమ్మాటికీ రాజకీయ హత్యేనని అన్నారు. ఆయన కుటుంబాన్ని వైఎస్ జగన్ పరామర్శించడాన్ని హోం మంత్రి తప్పుపట్టడం దారుణమన్నారు. ఒక హత్య కేసు దర్యాప్తులో ఉన్నప్పుడు అధికార ప్రతినిధులు ఎలాంటి వ్యాఖ్యలు చేయకూడదని ఉన్నా దాన్ని పక్కన పెట్టి బాధ్యత గల ఒక హోం మంత్రి ఇలా మాట్లాడడం సరికాదని పేర్కొన్నారు. వైఎస్ జగన్‌కు ప్రజల మద్దతు ఉన్నందు వలనే టీడీపీ భయపడుతోందని తెలిపారు. వైఎస్ జగన్‌లో ఉన్న నిజాయితీని ప్రజలు గుర్తిస్తారని అన్నారు.

అకాల వర్షంతో రైతుల అవస్థలు

నరసన్నపేట: మండలంలో మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి ధాన్యం రైతులు అవస్థలు పడ్డారు. రబీలో పండిన ధాన్యం కళ్లాల్లో, రోడ్లపైన ఉంచారు. వర్షానికి ఈ ధాన్యం తడిచి ముద్దయ్యాయి. పండిన ధాన్యం అమ్ముకోలేక నానా అవస్థలు పడుతుండగా ఈ దశలో వర్షానికి ధాన్యం తడవడంతో రైతులు ఆందోళన చెందారు. కరగాం, కంబకాయ, నరసన్నపేట, మాకివలస, దేవాది, పోతయ్యవలస తదితర గ్రామాల్లో రైతుల ధాన్యం వర్షానికి తడిచాయి. అలాగే రబీ పంటలకు ఈ వర్షం అనుకూలమని వేసవి దుక్కులు కూడా చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు అంటున్నారు.



కంబకాయ కూడలి వద్ద సర్వీసు రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం తడిచిన దృశ్యం



నిందితుడు హరీష్ గంగాధర్‌ను అరెస్టు చేసిన రెండో పట్టణ పోలీసులు

ఢిల్లీలో దొరికాడు

శ్రీకాకుళం క్రైమ్ : విదేశాల్లో చదువుకోవాలనుకున్న విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసి యూనివర్సిటీలో ఫీజులు కట్టకుండా ఎగ్గొట్టిన వ్యక్తిని ఎట్టకేలకు రెండో పట్టణ పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ అంశంపై ఏడుగురు బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు గత ఏడాది జులై 29న ఎస్పీ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాల్లోకి వెళ్తే.. కజికిస్తాన్ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ సీట్లు ఇప్పిస్తానని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన కొందరు విద్యార్థుల నుంచి తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌కు చెందిన హరీష్ గంగాధర్ ఒప్పందం ప్రకారం ఒక్కొక్కరి వద్ద రూ. 25 లక్షల నుంచి రూ. 45 లక్షల లోపు వసూలు చేశాడు. కజకిస్తాన్‌లో కళాశాల, వసతిగృహానికి సంబంధించి ఒక సంవత్సర ఫీజును మాత్రమే చెల్లించి మిగతా సొమ్ము సుమారు రూ. 2 కోట్లు కాజేశాడని సీఐ తెలిపారు. ఎప్పటి నుంచో తప్పించుకుని విదేశాల్లో తిరుగుతున్న హరీష్ గంగాధర్‌ను పట్టుకునేందుకు లుకౌట్ నోటీస్ పంపామని, ఎట్టకేలకు ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఇమ్మిగ్రేషన్ అధికారులు పట్టుకుని తమకు సమాచారం అందించారన్నారు. దీంతో ఢిల్లీ తమ పోలీసులను పంపి హరీష్ గంగాధర్‌ను అదుపులోకి తీసుకున్నామని బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు అరెస్టు చేసి రిమాండ్ కోసం కోర్టుకు తరలించామని సీఐ ఈశ్వరరావు వెల్లడించారు.

రాకాసి అలలకు బోటు ధ్వంసం



ధ్వంసమైన బోటును సముద్రంలో నుంచి తాళ్ల సాయంతో ఒడ్డుకు చేర్చుతున్న మత్స్యకారులు

సంతబొమ్మాళి: మండలంలోని లక్కివలస పంచాయతీ గెద్దలపాడు తీర ప్రాంతంలో సముద్ర అలల ధాటికి ఓ బోటు ధ్వంసమై రూ. 20 లక్షలు ఆస్తి నష్టం జరిగింది. వివరాల్లోకి వెళితే మంగళవారం సముద్రపు వేట ముగించుకొని 50 బోట్లను సముద్రంలో లంగరు వేశారు. ఎప్పటిలాగే బుధవారం ఉదయం గెద్దలపాడు గ్రామానికి చెందిన మత్స్యకారులు వేటకు బయల్దేరారు. తుఫాన్ కారణంగా సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో లంగరు వేసిన బోట్లు ఏమవుతాయని ఆందోళనతో 50 మంది మత్స్యకారులు తెప్పలపైన సముద్రంలోకి వెళ్లారు. మూడు గంటలు కష్టపడి లంగరు వేసిన 49 బోట్లను ఒడ్డుకు చేర్చగా అందులో ఒక బోటు కనిపించలేదు. కొద్దిసేపు మత్స్యకారులు గాలించగా బోటు సముద్రంలో మునిగిపోయి ఉండడాన్ని గమనించారు. తాళ్ల సాయంతో సుమారు వందమంది మత్స్యకారులు బోటును తీరం ఒడ్డుకు చేర్చడానికి కష్టపడ్డారు. అయితే అలల ఉధృతికి బోటు ధ్వంసమై వలలు చిరిగిపోయి సుమారు రూ. 20 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధిత మత్స్యకారుడు శ్రీరంగం వీరాస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ధ్వంసమైన బోటు, వలను ఫిషరీస్, రెవెన్యూ అధికారులతో పాటు మెరైన్ పోలీసులు పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియజేశారు. బోటు మీద ఆధారపడి జీవిస్తున్న 20 మత్స్యకార కుటుంబాలు వీధిన పడ్డాయని, ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్యకార నాయకులు చింతల రాజులు, శ్రీరంగం రాజులు కోరారు.

మహిళలపై అఘాయిత్యాలు అరికట్టాలి

- పోలీసులతో సమీక్షలో హోంమంత్రి అనిత




సమీక్షలో మాట్లాడుతున్న హోంమంత్రి అనిత

శ్రీకాకుళం క్రైమ్ : మహిళలు, బాలికల భద్రతలో భాగంగా వారిపై జరిగే అఘాయిత్యాలు అరికట్టాలని రాష్ట్ర హోంమంత్రి అనిత పోలీసు అధికారులకు స్పష్టం చేశారు. జిల్లాకు బుధవారం విచ్చేసిన హోంమంత్రి ముందుగా పోలీసు కార్యాలయానికి వచ్చి పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం డీఐజీ గోపినాథ్ జెట్టి, శ్రీకాకుళం, విజయనగరం ఎస్పీలు కేవీ మహేశ్వరరెడ్డి, వకుల్ జిందాల్, మన్యం-పార్వతీపురం ఏఎస్పీ అంకిత సూరానలు మంత్రికి పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. అనంతరం మూడు జిల్లాల అధికారులతో మంత్రి సమీక్షించారు. ముందుగా ఎస్పీ మహేశ్వరరెడ్డి జిల్లాలో మహిళలు, బాలికలకు సంబంధించిన నేరాలు, పోక్సో, గంజాయి ఇతర మాదక ద్రవ్యాల కేసులు, గ్రేవ్ ప్రాపర్టీ కేసుల నమోదు, నేర నియంత్రణ చర్యలు, దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఛేదించిన తీరును వివరించారు. హోం మంత్రి అనిత మాట్లాడుతూ ఫింగర్ ప్రింట్ పరికరాలు, డ్రోన్, సీసీ కెమెరాలు అందిస్తామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు శక్తి బృందాల ద్వారా సెల్ఫ్ డిఫెన్సు శిక్షణ తరగతులు నిర్వహించాలని, డ్రాప్ బాక్స్‌లను ఏర్పాటుచేయాలన్నారు. సైబర్ పోలీస్‌స్టేషన్‌ను అందుబాటులోకి తెస్తామని, సాంకేతిక పరిజ్ఞానంపై నైపుణ్యం ఉన్న సిబ్బందిని నియమించి కేసులు త్వరితగతిన ఛేదించాలన్నారు. హోంమంత్రి రాకతో ఎచ్చెర్ల మండలం ఎస్ఎంపురానికి చెందిన తప్పిట గుళ్ల కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీలు పి.శ్రీనివాసరావు, పి.సౌమ్యలత, డీఎస్పీలు వివేకానంద, అప్పారావు, శేషాద్రి, రాంబాబు, భవ్యారెడ్డి, , రాఘవులు, శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

శ్రీకాకుళానికి చెందిన క్యాన్సర్ బాధితురాలు లతశ్రీ హోం మినిస్టర్ కలవాలనే కోరిక వ్యక్తం చేయడంతో ఆమెను అనిత కలిసి యోగక్షేమాలు అడిగారు. ధైర్యంగా ఉండాలని చెప్పారు.

అంతే వీరు.. మారదు తీరు



- మామూళ్ల మత్తులో బీసీ సంక్షేమ శాఖ
- పనిని బట్టి రేటు.. లేదంటే సాకు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ తీరు మారడం లేదు. ఏ సీటు చూసినా ఏమున్నది గర్వకారణం.. శాఖ సమస్తం అవినీతిమయం అన్న రీతిలో ఇక్కడ వసూళ్లు జరుగుతున్నాయి. పదోన్నతులు, ఇంక్రిమెంట్లు, ఇన్‌చార్జిల నియామకం, బిల్లులు పెట్టడం, ఇలా ప్రతి పనికీ ఒక రేటును నిర్ణయించారు. ఇక్కడి సిబ్బందే అవినీతి గురించి బాహాటంగా చెబుతున్నారు.

అ‘ధనపు’ బాధ్యతలు

శాఖలో ఇష్టానుసారం అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఉన్న పని చేసేందుకే ఇబ్బందులు పడుతుంటే.. అదనపు వసతి గృహాల బాధ్యత తీసుకుంటున్న ఏకైక శాఖ బీసీ సంక్షేమమే. కనీసం హాస్టళ్ల మధ్య దూరమైనా పరిగణనలోకి తీసుకోకుండా ఇన్‌చార్జిలను నియమిస్తున్న వైనం విస్మయపరుస్తోంది. వార్డెన్ పోస్టుల నియామకాలు లేకపోవడం, పదోన్నతులు, ఉద్యోగ విరమణలు వంటి కారణాలతో ఎక్కువ ఖాళీలు ఉన్నాయి. దీంతో ఇన్‌చార్జిలపై ఆధారపడక తప్పని పరిస్థితి. ఇదే అదనుగా చాలా మంది వసూళ్లకు తెర తీస్తున్నారు. వీరి వల్ల నిజాయితీగా ఉండేవారికి కూడా చెడ్డపేరు వస్తోంది. నరసన్నపేట బీసీ బాలికల వసతి గృహాన్ని పొందూరులోని హెచ్‌డబ్ల్యూకి అప్పగించారు. ఈ రెండింటి మధ్య దూరం 50 కిలోమీటర్లు. రెండు హాస్టళ్ల మధ్య చాలా హాస్టళ్లు ఉన్నాయి. అయినాబాధ్యతల అప్పగింతలో ఇవేవీ చూసుకోలేదు. బీసీ సంక్షేమ శాఖ వార్డెన్‌ను కాదని, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు బాధ్యతలు అప్పగించడం మరో విచిత్రం. ఇచ్ఛాపురం-బారువ, రాజపురం-పలాస-కంచిలి, కింతలి-మురపాక వంటి హాస్టళ్ల మధ్య దూరం చాలా ఎక్కువగా ఉన్నా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడం ఆశ్చర్యకరం.

ఇవి ఇక్కడ షరా ‘మామూలే’



- ఇటీవల బీసీ కళాశాల వసతి గృహంలో ఒక విద్యార్థినిపై దాడి జరిగింది. ఇక్కడి వార్డెన్‌పై కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. అయితే అక్కడ సీసీ కెమెరాలు, ఇతర వసతులు కల్పించాల్సి ఉంది. ఆ శాఖ ఉన్నతాధికారి అన్ని ఖర్చులు వార్డెన్ చేత పెట్టించి బిల్లులు మాత్రం ఉన్నతాధికారి అప్పగించారు.
- పోలవరంలో విద్యార్థులు అస్వస్థతకు గురైతే ఆ వార్డెన్ విద్యార్థుల కోసం పెట్టిన ఖర్చు కంటే ఉన్నతాధికారుల కోసం పెట్టిన ఖర్చు చాలా ఎక్కువ. ఒక వేళ ఎవరి గురించైనా పేపర్‌లో వార్త వస్తే ఉన్నతాధికారులు దాన్నీ సొమ్ము చేసుకుంటారని భోగట్టా.
- స్టడీ సర్కిల్‌కు చైర్‌లు కొనడానికి కలెక్టర్ డబ్బులిచ్చినా.. ప్రతి వార్డెన్ చేత రెండేసి కుర్చీలు కొనిపించి తీసుకున్నారు.



ఎగసిన నినాదం

పెరిగిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా ఎచ్చెర్లలో ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్మిక వర్గాలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా సీపీఎం శ్రీకాకుళం నగర కమిటీ ఆధ్వర్యంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా, వినియోగదారులపై భారం మోపడం అన్యాయమన్నారు. నిత్యావసర సరుకుల ధరలపై నియంత్రణ తెస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం, అన్ని రకాల సరుకులు, వస్తువులపై ధరలను విపరీతంగా పెంచిందని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు అమాంతం తగ్గుతుంటే, దేశీయంగా మోదీ సర్కార్ ఎప్పటిలాగే తన ఖజానాను నింపుకునే పనిలో ఉందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.ప్రసాదరావు, నాయకులు ఆర్.ప్రకాశరావు, బి.గోవర్ధనరావు, కె.సూరయ్య, ఎ.సత్యం, ఎ.సోమశేఖర్, ఎం.ఆదినారాయణ మూర్తి, ఎల్.మహేష్, పార్వతీశం, బి.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గ్యాస్ ధరల పెంపునకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో డే అండ్ నైట్ వద్ద నిరసన

తగ్గించాల్సిందే..

ఎచ్చెర్ల క్యాంపస్: కూటమి ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను తక్షణం తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు డిమాండ్ చేశారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుకు వ్యతిరేకంగా ఎచ్చెర్లలో ధర్నా నిర్వహించారు. గోవిందరావు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో క్రూడాయిల్ తగ్గినా, దేశంలో మాత్రం వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతున్నారని అన్నారు. ధరల పెరుగుదల పేదలపై ప్రభావం చూపుతుందని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.తేజేశ్వరరావు, నాయకులు డి.బంగార్రాజు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి కొల్లవానిపేట రైల్వే గేట్ మూత

నరసన్నపేట: మండలంలోని కొల్లవానిపేట రైల్వే గేట్‌ను గురువారం నుంచి మూడు రోజుల పాటు మూసివేస్తున్నట్లు శ్రీకాకుళ రోడ్ సీనియర్ సెక్షన్ ఇంజనీర్ ఎం.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. కొల్లవానిపేట గేట్ పరిసరాల్లో ట్రాక్ నిర్వహణ పనులు నిర్వహిస్తున్నందున గేట్ మూసి వేస్తున్నట్లు పేర్కొన్నారు. 10వ తేదీ ఉదయం నుంచి 12వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు గేట్ మూత వేస్తున్నామని, వాహనదారులు, సమీప గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

మహిళా ప్రాంగణంలో కలకలం

- ఇద్దరు యువతులు అదృశ్యం
- బ్యూటీషియన్ కోర్సులో శిక్షణకు వచ్చి మాయం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న ఆంధ్రప్రదేశ్ మహిళా ఆర్థిక సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్.టి.ఆర్ నైపుణ్య అభివృద్ధి శిక్షణ కేంద్రం (స్త్రీ సదన్ మహిళా ప్రాంగణం)లో ఇద్దరు యువతులు అదృశ్యం కావడం కలకలంగా మారింది. బ్యూటీషియన్ శిక్షణ పొందుతున్న 21 ఏళ్ల యువతి, 18 ఏళ్ల యువతి మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో లంచ్ బ్రేక్‌కు బయటకు వెళ్లి రాత్రి అయినా తిరిగి రాలేదు. దీంతో స్త్రీసదన్ ఇన్‌చార్జ్ సనపల సత్యవతి ఇన్‌చార్జ్ మహిళా ప్రాంగణం మేనేజర్ పి.విమల సూచన మేరకు ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు 6309990816, 6309990816 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ ఇద్దరు యువతులదీ విశాఖపట్నం కాగా, ఇద్దరికీ తల్లిదండ్రులు లేరు. ఇందులో ఓ యువతికి దూరపు బంధువులు ఉన్నట్లు తెలిసింది. విశాఖపట్నం స్త్రీసదన్‌లో బ్యూటీషియన్ కోర్సు లేకపోవటంతో వీరు ఎచ్చెర్ల కేంద్రంలో చేరి ఈ నెల ఒకటో తేదీ నుంచి శిక్షణ పొందుతున్నారు. శిక్షణ కాలం రెండు నెలలు. వీరిద్దరు స్నేహితులు. ఇద్దరి వద్దా ఫోన్లు లేదు. తోటి అభ్యర్థుల వద్ద ఫోన్ తీసుకుని హైదరాబాద్, విశాఖపట్నం ప్రాంతాల్లో ఉంటున్న ఇద్దరు వ్యక్తులతో తరచూ మాట్లాడుతున్నట్లు తెలిసింది. ఆ ఫోన్ నంబర్లు ప్రస్తుతం స్విచ్ ఆఫ్ వస్తున్నట్లు సమాచారం. ఇద్దరూ మేజర్లు కావటంతో ప్రేమ వ్యవహారమా? ఇతర కారణాలు ఉన్నాయా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వ్యక్తిగత కారణాలు ఉంటే స్థానిక అధికారుల వద్ద అనుమతి తీసుకొని వెళ్లవచ్చు. అలాకాకుండా సిబ్బంది కళ్లుగప్పి వెళ్లిపోవడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు.

11న విదేశాల్లో ఉద్యోగాలకు జాబ్‌మేళా


వి.వి.నాగేశ్వరరావు

టెక్కలి: విదేశాల్లో వివిధ రకాల ఉద్యోగాల కోసం ఈ నెల 11న టెక్కలి ఆదిత్య ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. తెలంగాణ కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ గుర్తింపు పొందిన తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆస్ట్రేలియా, కెనడా, జర్మనీ, హంగేరి, జపాన్ వంటి దేశాల ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు భాగస్వామ్యంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హెల్త్‌కేర్, నాన్ హెల్త్‌కేర్ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన వారు సౌదీ అరేబియా, కతార్, యూకే, కెనడా, జపాన్, జర్మనీ, ఇజ్రాయిల్, అమెరికాలోని ఆరోగ్య రంగంలో పనిచేయడానికి దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, బీటెక్, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు జపాన్, జర్మనీ, ఫిజి, గ్రీస్‌లలో ఆరోగ్యేతర రంగాల్లో ఉద్యోగాలు చేయడానికి అర్హులని తెలిపారు. 40 ఏళ్లలోపు వయసు కలిగి ఆసక్తి గలవారు జాబ్‌మేళాకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8466096181, 9876339690 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు ఇద్దరు ఎంపిక


జి.ఢిల్లేశ్వరరావు, బి.రమేష్

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ సబ్‌జూనియర్స్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో గొర్లె ఢిల్లేశ్వరరావు, బుగత రమేష్ ఉన్నారు. ఒడిశా వేదికగా జరగనున్న ఈ పోటీల కోసం ఇక్కడి నుంచి పయనమై వెళ్లారు. వీరిద్దరూ అల్లినగరం జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్నారు. ఢిల్లేశ్వరరావుది లావేరు మండలం సెగిడిపేట గ్రామం. రమేష్ ఎచ్చెర్ల మండలం చిలకపాలెం గ్రామానికి చెందినవాడు. గతంలో వీరిద్దరూ అనేక రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించడంతోపాటు రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-14, అండర్-17 వయో విభాగాల్లో రజత, కాంస్య పతకాలతో సత్తాచాటారు. తాజాగా జాతీయ పోటీలకు ఎంపికయ్యారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష

- గ్రామాల్లో ఆటలమ్మ, గవదబిళ్లల కేసులు
- వేసవి నేపథ్యంలో పెరుగుతున్న తీవ్రత
- పిల్లల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



పాతపట్నం:

వేసవి వచ్చిందంటే చాలు కొందరికి అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయి. ముఖ్యంగా చిన్నారుల్లో చికిన్‌పాక్స్ ఎక్కువగా కనిపిస్తుంటుంది. గవదబిళ్లలు, ఆటలమ్మగా పిలిచే ఈ సమస్య బారిన పడిన వారికి జలుబు, జ్వరం, శరీరంపై పొక్కులు, దవడలకు ఇరువైపులా వాపు, నొప్పి వంటివి తీవ్రంగా బాధిస్తాయి. అన్ని వయసుల వారికి ఈ అంటువ్యాధులు సోకే అవకాశమున్నా, ప్రధానంగా చిన్నారుల్లో ఎక్కువగా వస్తుంటుందని వైద్యులు చెబుతున్నారు. అందుకే ముందు జాగ్రత్త, అప్రమత్తతతో వ్యవహరిస్తే దీని బారిన పడకుండా రక్షణ పొందవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. పదేళ్లలోపు చిన్నారుల విషయంలో మరింత శ్రద్ధ చూపాలని చెబుతున్నారు.

వ్యాధి నిరోధక శక్తి తక్కువుంటే..

సాధారణంగా వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉన్న వారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంటుంది. అందుకే చిన్నారులు బలవర్ధకమైన ఆహారం తీసుకునేలా తల్లిదండ్రులు చొరవచూపాలి. ఆటలమ్మ, గవదబిళ్లలు సోకిన వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతారు. ఆకలి లేకపోవడం, ఆహారం సరిగా తీసుకోలేకపోవడం వంటి చర్యలు వల్ల తీవ్రంగా నీరసించిపోతారు. శరీరంపై నీటి పొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే ఆటలమ్మగా గుర్తించి వైద్యులను సంప్రదించాలి. వ్యాధి తీవ్రత ఆధారంగా వైద్యుల సూచన మేరకు యాంటీవైరస్, యాంటీ బయోటిక్ మందులు వాడాల్సి ఉంటుందిల్లీ

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- ఆటలమ్మ సోకిన వారిని మిగతా వారికి దూరంగా ఉంచాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు ఇవ్వడం మంచిది.
- గవదబిళ్లలు వచ్చిన వారికి గొంతునొప్పి తీవ్రంగా ఉంటుంది. తరచూ ద్రవపదార్థాలను ఆహారంగా తీసుకోవాలి.
- ఆటలమ్మ, గవదబిళ్లలు వచ్చిన వారి విషయంలో ప్రజలు అపోహలు, మూఢ నమ్మకాలతో వైద్య సహాయం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారు. అది మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే మెదడు, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. ఇలాంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు పిల్లలకు గోరువెచ్చని నీరు, శుభ్రమైన ఆహారం ఇవ్వడంతో పాటు పరిసరాల్ని పరిశుభ్రంగా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

నిర్లక్ష్యం తగదు..



ఆటలమ్మ, గవదబిళ్లల వ్యాధులపై నిర్లక్ష్యం తగదు. చిన్నారులు ఎక్కువగా ఈ సమస్యతో బాధపడుతుంటారు. వ్యాధి లక్షణాలు కనిపించగానే వెంటనే వైద్యులను సంప్రదించి వారి సూచనలు మేరకు మందులు వాడాలి.

– డాక్టర్ ఎస్.కృష్ణారావు, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, పాతపట్నం

చిల్లంగి నెపంతో చంపేశారు..

- అనుమానాస్పద మృతిని ఛేదించిన ఎచ్చెర్ల పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వివేకానంద



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద, సీఐ అవతారం, (ఇన్‌సెట్లో) మృతుడు ఈశ్వరరావు

శ్రీకాకుళం క్రైమ్/ఎచ్చెర్ల క్యాంపస్ : తన కుమారుడిని చిల్లంగి పెట్టి చంపేశాడన్న మూఢ నమ్మకంతో ఓ వ్యక్తి తన కుటుంబీకులతో దారుణానికి ఒడిగట్టాడు. అన్యాయంగా ఓ వ్యక్తిని చంపేశాడు. ముందు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన ఎచ్చెర్ల పోలీసులు చివరికి హత్య కేసుగా ధృవీకరించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీ వివేకానంద వివరాలు వెల్లడించారు.

అనుమానాస్పద మృతిగా..

ఎచ్చెర్ల మండలం అజ్జరాం గ్రామానికి చెందిన బోర ఈశ్వరరావు గతేడాది డిసెంబరు 15న అదే గ్రామ పరిధిలోని కాష్యూ గార్డెన్ సమీపంలో మృతదేహంగా కనిపించాడు. ఎచ్చెర్ల ఎస్ఐ సందీప్ అదే రోజు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఈలోగా మృతుని పోస్టుమార్టం రిపోర్టును సంబంధిత వైద్యులు ఇచ్చారు. అందులో మృతుడి మెడ చుట్టూ ఉన్న లిగేచర్ మార్క్, తలలో రక్తస్రావం ఆధారంగా మృతుడు ఈశ్వరరావుని ఎవరో తీవ్రంగా కొట్టి, మెడ నొక్కి చంపినట్లు గుర్తించారు. దీంతో కేసును జె.ఆర్.పురం సీఐ ఎం.అవతారం హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విచారణలో అనేక విషయాలు..

అజ్జరాం గ్రామానికి చెందిన బోర ఆదినారాయణ కుమారుడు బోర సాయి గిరిధర్ రెడ్డి (24) జ్వరంతో బాధపడుతుండేవాడు. రూ.11 లక్షలు ఖర్చు పెట్టినప్పటికీ ఫలితం లేకపోవడంతో 2024 జూలైలో చనిపోయాడు. తన కుమారుని చావుకి బోర ఈశ్వరరావే కారణమని, చిల్లంగి పెట్టి చంపి వుంటాడని గట్టిగా నమ్మాడు. దీంతో అతని సోదరుడు బోర సంజీవరెడ్డి, మేనల్లుడు నగిరెడ్ల గోవిందు (లావేరు మండలం, సీతాపురం)లతో కలిసి ఎలాగైనా ఈశ్వరరావును తుదముట్టించాలనుకున్నాడు.

ఇలా చంపేశారు..

గతేడాది డిసెంబరు 15న అజ్జరాం గ్రామం సమీపంలోనే ఈశ్వరరావును దారి కాచి ముందుగా కొట్టారు. అనంతరం పురుగుల మందు తాగించి మెడ చుట్టూ తువ్వాలు చుట్టి బిగించి చంపేశారు. మంగళవారం సాయంత్రం ఏ-1 నిందితుడైన బోర ఆదినారాయణను అజ్జరాంలోని అతని తోట వద్దే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నిజాన్ని అంగీకరించాడు. బుధవారం ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి తువ్వాలు, పురుగుల మందు సీసా స్వాధీనం చేసుకున్నారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ అవతారం ఆధ్వర్యంలోని ఎచ్చెర్ల పోలీసులను డీఎస్పీ వివేకానంద అభినందించారు.

టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో హైడ్రామా


అంబులెన్సులో సంతోష్‌కుమార్‌ను తీసుకెళ్తూ..

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఉదయం హైడ్రామా నడిచింది. ఫిర్యాదు ఇచ్చేందుకు వెళ్లిన ఓ వ్యాపారిపై పోలీసులు చెంపదెబ్బ కొట్టారని అతని భార్య ఆడియో వైరల్ కాగా.. అదే సమయంలో అతను ధ్యానముద్రలోకి వెళ్లిపోయినట్లు పోలీసులు చెప్పడం గమనార్హం. ఓ వైపు హోంమంత్రి అనిత అదే సమయంలో జిల్లాకు రానుండటం, ఈ విషయం ఎక్కడ సంచలనంగా మారుతుందోనని పోలీసులు కలవరపాటుకు గురయ్యారు. సీఐ ఈశ్వరరావు, ఫిర్యాదుదారులు చెప్పిన వివరాలిలా ఉన్నాయి.. సకలాభక్తుల హరిహరకుమార్, మల్లా సంతోష్‌కుమార్‌లు టీటీడీ కల్యాణ మండపం సమీపంలో వలలు తయారు చేసే దుకాణాలు నడుపుతున్నారు. ఇద్దరూ బంధువులు కావడం, లావాదేవీల్లో తేడాలు రావడం, హరిహరకుమార్ కుమారుడు సచిన్.. సంతోష్‌కుమార్‌తో గొడవపడటంతో టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు బుధవారం ఉదయం 9:45 గంటలకు వెళ్లి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు.

స్టేషన్‌లో ఏమైందంటే..

సంతోష్‌కుమార్ భార్య సంధ్య మీడియాకు వాట్సాప్ ద్వారా ఆడియో రికార్డు రిలీజ్ చేశారు. తన భర్త ఫిర్యాదివ్వడానికి వెళ్తే పోలీసులు చెంపదెబ్బ కొట్టారని, కాసేపయ్యాక స్పృహ కోల్పోయారని పేర్కొన్నారు. ఈ విషయమై స్టేషన్ ఎస్ఐ-2 రామారావు వద్ద ప్రస్తావించగా.. తాను సంతోష్ కుమార్‌ను చెంపదెబ్బ కొట్టలేదని కొద్దిగా దూరం వెళ్లి కూర్చోమని తోయగా అక్కడే ధ్యానం చేస్తూ కూర్చుండిపోయాడని చెప్పారు. స్పృహ కోల్పోలేదని స్పష్టం చేశారు. స్టేషన్‌కు వచ్చిన సమయంలో సంతోష్‌కుమార్ అడ్డంగా పడుకుని ఉన్నాడని, అతని భార్యకు చెబితే ఆమెపైనే చేయి చేసుకున్నాడని పేర్కొన్నారు. ఇదే విషయమై స్టేషన్ ఎస్‌హెచ్‌వో, సీఐ ఈశ్వరరావు వద్ద ప్రస్తావించగా సంతోష్‌కుమార్ అనే వ్యక్తి హరిహరరావు వద్ద రూ. 30 లక్షలు ఛీటింగ్ చేశాడని, ఇందుకు సంబంధించిన పత్రాలు వారి వద్ద ఉన్నాయని, స్టేషన్‌లో ఎవరూ అతన్ని కొట్టలేదని, థర్డ్‌పార్టీ స్టేట్‌మెంట్ కూడా తీసుకున్నామని, అతను హరహరరావుపై పెట్టిన కేసు గుర్తింపదగనిదిగా గుర్తించి కేసు నమోదు చేయలేదన్నారు. సంతోష్‌కుమార్‌పై మాత్రం ఛీటింగ్ కేసు నమోదైందన్నారు. ఆసుపత్రిలో సైతం సంతోష్‌కుమార్ విచిత్రంగా ప్రవర్తిస్తూ వైద్యులకు విసుగు తెప్పించాడన్నారు. అంబులెన్సు కూడా తమ స్టేషన్ వద్దకు రాలేదని చెప్పారు.

ముమ్మాటికీ కూటమి ప్రభుత్వ కుట్రే

- ఎమ్మెల్సీ నర్తు రామారావు


నర్తు రామారావు, ఎమ్మెల్సీ

కవిటి/ఇచ్ఛాపురం రూరల్ : దేశంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన నేతల్లో ఒకరైన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై కూటమి ప్రభుత్వం అడుగడుగునా కుట్రకు పాల్పడుతోందని ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆరోపించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిపక్ష నేత భద్రత విషయంలో కూటమి సర్కారు అనుసరిస్తున్న వైఖరిపట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా పాపిరెడ్డి పల్లెలో మంగళవారం జరిగిన పర్యటనలో కనీస భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం దారుణమన్నారు. జగన్‌ను చూసేందుకు ఎగబడిన జనాలను అదుపు చేయడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని చెప్పారు. హెలిప్యాడ్ వద్ద అరకొర సిబ్బంది ఉండటం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఒక మాజీ ముఖ్యమంత్రికి ఇవ్వాల్సిన సెక్యూరిటీ ఇవ్వలేదని ఆరోపించారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని ధ్వజమెత్తారు.

ప్రైవేట్ డిగ్రీ కాలేజీల సమస్యలు పరిష్కరించాలి


రాష్ట్ర కార్యవర్గానికి ఎంపికైన జిల్లా ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోషియేషన్ అధ్యక్షుడు పొన్నాన జయరాం డిమాండ్ చేశారు. సంఘ కార్యవర్గాన్ని కడపలో బుధవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన సన్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పొన్నాన జయరాం, జాయింట్ సెక్రటరీగా జిల్లాకు చెందిన బొంతు శ్రీనివాసరావు, రీజనల్ కో-ఆర్డినేటర్‌గా కోట మురళీధర్, కార్యవర్గ సభ్యునిగా దేవరాజులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త కోర్సులు ప్రారంభానికి అడ్డంగా ఉన్న జీవో 36 రద్దు చేయాలని, జీవో 22 రద్దు చేసి ఫీజులు నిర్ణయాధికారం స్థానిక వర్సిటీలకు అప్పగించాలని, పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపజేయాలని, ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అర్హత పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రైవేట్ ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులు ఏఐటీటీ- 2025 అర్హత పరీక్షకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ఐటీఐ ప్రవేశాల కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల వారు సమీప ప్రభుత్వ ఐటీఐల్లో ఈ నెల 12లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 21 ఏళ్లు పూర్తయిన వారు అర్హులని పేర్కొన్నారు. ఐటీఐ ట్రేడ్ పూర్తిచేసి రిజిస్టర్ కంపెనీల్లో మూడేళ్ల అప్రెంటీస్ అనుభవం కలిగి ఉండాలని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు సమీప ఐటీఐలో సంప్రదించాలన్నారు.

క్రైం కార్నర్..

వస్త్ర వ్యాపారి అనుమానాస్పద మృతి


బావిలో తేలుతున్న కిషోర్‌కుమార్ మృతదేహం

పొందూరు: మండల కేంద్రం పొందూరుకు చెందిన వస్త్ర వ్యాపారి ఉండ్రాళ్ల కిషోర్‌కుమార్(50) అనుమానాస్పదంగా మృతిచెందారు. బుధవారం ధర్మపురం గ్రామ సమీపంలోని బావిలో మృతదేహం తేలడంతో గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటకు తీయగా పొందూరుకు చెందిన వస్త్ర వ్యాపారి కిషోర్‌గా గుర్తించారు. వెంటనే భార్య అనూషకు సమాచారం అందించారు. మంగళవారం రాత్రి ధర్మపురంలో బాకీలు వసూలు చేసేందుకు వెళ్లాడని, బావిలో పొరపాటున కాలుజారి పడిపోయి ఉంటారని అనూష ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వి.సత్యనారాయణ చెప్పారు. మృతదేహాన్ని బయటకు తీసి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కిషోర్‌కుమార్‌కు భార్య అనూష, కుమారుడు శ్రీనిత్, కుమార్తె శ్రీయ ఉన్నారు. కాగా, పొందూరులో దశాబ్దాలుగా కిషోర్ కుటుంబీకులు వస్త్రవ్యాపారం చేస్తున్నారు. వ్యాపారంలో ఒడిదుడుకులు రావడం, కస్టమర్లకు ఎక్కువగా అరువులు ఇవ్వడం, దీనికి తోడు బ్యాంకు రుణం ఉండటంతో కొన్నాళ్లుగా ఆందోళన చెందుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పొందూరులో సుపరిచితుడైన కిషోర్ మృతితో విషాద ఛాయలు అలముకున్నాయి.

బాలిక ఆత్మహత్య


సింధిరి అపూర్వ మృతదేహం

కవిటి: మండలంలోని కె.కపాసుకుద్దికి చెందిన సింధిరి అపూర్వ(13) అనే బాలిక మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. కవిటి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అపూర్వ కొంతకాలంగా తరచూ అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో మనస్తాపం చెంది మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఇంట్లోనే ఉరి వేసుకుంది. ఈ మరణంపై తమకు ఎటువంటి అనుమానాలు లేవని మృతురాలి తల్లి హేమలత పోలీసులకు తెలియజేసినట్లు ఎస్ఐ వి.రవివర్మ తెలిపారు. ఈ మేరకు కవిటి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతదేహానికి బుధవారం ఉదయం సోంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..


ఆత్మహత్య చేసుకున్న భాగమతి

పుట్లూరు: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన భాగమతి (32)కి మూడేళ్ల క్రితం చెన్నైలోని పుట్లూరు మండలం గాండ్లపాడుకు చెందిన రామేశ్వరరెడ్డితో వివాహమైంది. వీరికి రెండేళ్ల వయసున్న కుమారుడు ఉన్నారు. రెండేళ్ల కిందట రామేశ్వరరెడ్డి రెండు ఎకరాల భూమిని విక్రయించగా వచ్చిన రూ.30 లక్షలను ఇతరులకు అప్పుగా ఇచ్చాడు. అప్పు తీసుకున్న వ్యక్తి వడ్డీలు సక్రమంగా చెల్లించకపోగా, అసలు చెల్లింపులోనూ తాత్సారం చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో మనస్తాపానికి గురైన భాగమతి బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరి భారతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటనరసింహ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎస్ఐ పేరిట రూ.60 వేలకు టోకరా

- నిజమేనని నమ్మి మోసపోయిన యువకుడు
- మందసలో సైబర్ మోసం

మందస: మందసకు చెందిన శ్రీనివాస్ పాడి అనే యువకుడు సైబర్ మోసానికి గురయ్యాడు. శ్రీనివాస్‌కు మంగళవారం రాత్రి ఓ అజ్ఞాత వ్యక్తి ఫోన్ చేసి ఎస్ఐకు అర్జెంట్‌గా రూ.60 వేలు నగదు అవసరమైందని చెప్పాడు. ఫోన్ పే చేస్తే ఆ డబ్బును కానిస్టేబుల్‌తో తిరిగి పంపించేస్తానని తెలిపాడు. మాట తీరు బట్టి నిజమేనని నమ్మిన శ్రీనివాస్ 75693 41175 అనే నంబర్‌కు ఫోన్ పే చేశాడు. కానిస్టేబుల్ ఎంతసేపటికీ రాకపోయేసరికి కొద్ది సమయం తర్వాత ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. ఇది సైబర్ నేరగాళ్ల పనిగా గుర్తించిన పోలీసులు విచారణ చేపడతామని చెప్పారు.

పురుగు మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య


వృద్ధుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్ఐ వైకుంఠరావు

మెళియాపుట్టి : మండలంలోని జర్రిభద్ర గ్రామానికి చెందిన దుంపల సూర్యారావు(80) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సూర్యారావుకు ఐదుగురు కుమారులు. చాలా సంవత్సరాల క్రితమే భార్య చనిపోవడంతో నెలకొక కుమారుడి ఇంటి వద్ద ఉంటున్నాడు. ప్రస్తుతం కుమారుడు నాగేశ్వరరావు వద్ద ఉండేవాడు. ఏం జరిగిందో గానీ మంగళవారం మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం గ్రామానికి కొంతదూరంలో ఉన్న పంటపొలాల్లో వాంతులు చేసుకుంటూ పడిపోయాడు. స్థానికులు గమనించి సమాచారం అందించగా మరో కుమారుడు అప్పారావు 108 అంబులెన్సులో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించాడు. అక్కడ చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. పురుగుల మందును నీటిలో కలిపి తాగినట్లు పోలీసులు గుర్తించారు. కుమారుడు నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై రమేష్ బాబు తెలిపారు.

బ్యాంకు ఉద్యోగి దుర్మరణం


హరినాథ్‌కుమార్ నాయుడు(ఫైల్)

నరసన్నపేట: నెల్లూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసన్నపేట నాయుడువీధికి చెందిన హరినాథ్‌కుమార్ నాయుడు (బాబీ)(46)మృతిచెందారు. ఈయన నెల్లూరు జిల్లా ముత్తుకూరు యాక్సిస్ బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తున్నారు. తిరుపతిలో నివాసం ఉంటున్నారు. మంగళవారం ద్విచక్ర వాహనంపై వెళ్తూ ముత్తుకూరు మండలం కొప్పలదొరువు సమీపంలో కుక్క అడ్డంగా రావడంతో అదుపుతప్పి పడిపోయారు. ఈ ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు వెంటనే ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బుధవారం వేకువజామున చికిత్స పొందుతూ మృతిచెందారు. దీంతో నాయుడు వీధిలో విషాదం అలముకుంది. మంచి మిత్రుడిని కోల్పోయామని గొద్దు చిట్టిబాబు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.

రైలు ఢీకొని యువకుడు మృతి


యువకుడి మృతదేహం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం-తిలారు రైల్వేస్టేషన్ల మధ్య బుధవారం గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి తెలుపు షర్టు, నలుపు ఫ్యాంట్ ధరించాడని, 30 ఏళ్ల ఉండవచ్చని భావిస్తున్నారు. మృతికి గల కారణాలు తెలియలేదు. వివరాలు తెలిసిన వారు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ డి.హరినాథ్(8985021143)కు తెలియజేయాలని కోరారు.

బంగారం కోసం వృద్ధురాలిపై దాడి


గాయపడిన వృద్ధురాలు

సోంపేట : మండలంలోని కొర్లాం పంచాయతీ బ్రాహ్మణ కొర్లాంకు చెందిన వృద్ధురాలు బంగారు దమయంతిపై గుర్తు తెలియని వ్యక్తి దాడి చేసి ఆమె వద్ద ఉన్న బంగారంతో పరారయ్యాడు. బారువ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దమయంతి పాలు అమ్ముకుని ఇంటికి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి దాడి చేశాడు. ముక్కున ధరించిన బంగారాన్ని దోచుకుని పరారయ్యాడు. విషయం తెలుసుకున్న సీఐ బి.మంగరాజు, ఎస్ఐ హరిబాబునాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితురాలితో మాట్లాడి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

30 ఎకరాల గడ్డివాములు దగ్ధం


తోటాడలో కాలిపోతున్న గడ్డివాములు

నరసన్నపేట: మండలంలోని తోటాడలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో పెద్దిని రమణయ్య, కొంకాన తిరుపతిరావులకు చెందిన 30 ఎకరాల గడ్డవాములు దగ్ధమయ్యాయి. సుమారు లక్ష రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. మధ్యాహ్నం 12.30 సమయంలో ఒక్కసారిగా గడ్డివాముల నుంచి మంటలు రావడంతో వెంటనే రైతులు గమనించి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా గాలి తీవ్రత అధికంగా ఉండటంతో మరింతగా వ్యాపించాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు ఆడంగి సూర్యనారాయణ ఇచ్చిన సమాచారంతో నరసన్నపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే గడ్డివాములు కాలిపోయాయి. ఇదే కళ్లంలో ఉన్న ధాన్యం బస్తాలను రైతులు వెంటనే ఇతర ప్రాంతానికి తరలించడంతో నష్టం తగ్గింది. రైతుల కళ్లాలపై నుంచి విద్యుత్ వైర్లు ఉండటం వల్ల ఈ ప్రమాదం సంభవించినట్లు రైతులు అనుమానిస్తున్నారు. పశువుల కోసం ఉంచిన గడ్డి వాములు కాలిపోవడంతో రైతులు ఆందోళన చెందారు.